సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం । 16 । సెప్టెంబర్ । 2024



ఆర్థిక భరోసా.. జీవితం కులాసా
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీవితాలకు తపాలా జీవిత బీమా పథకం పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ) భరోసా ఇస్తోంది. - 8లో



వైఎస్ జగన్ ప్రభుత్వంలో విద్యకు అగ్రతాంబూలం
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో విద్యకు అగ్రతాంబూలం ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు తెలిపారు. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 35.1 /25.2
జిల్లాలో శనివారం 25.2 – 35.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

సత్య కుమార్.. సత్యాలు మాట్లాడు



వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ సత్యాలు మాట్లాడితే బాగుంటుంది. సుమారు రూ.500 కోట్లతో 50 ఎకరాలలో 100 సీట్లతో సీఎం హోదాలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పులివెందులలో మెడికల్ కళాశాల నిర్మించారు. ఈ విషయం తెలుసుకోకుండా ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ జగన్మోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు. కళాశాల ఏ విధంగా నిర్మించారో.. అక్కడి గదులు ఏ విధంగా ఉన్నాయో ఆరోగ్య శాఖ మంత్రిగా ఒకసారి పులివెందులకు వచ్చి మెడికల్ కళాశాలను పరిశీలిస్తే తెలుస్తుంది.
– గోటూరు చిన్నప్ప, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, పులివెందుల



మంత్రి బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు



మంత్రి సత్యకుమార్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారు. మెడికల్ కళాశాల నిర్మాణాలు పూర్తయినా పూర్తి కాలేదంటూ అసత్యాలు పలకడం సత్యకుమార్‌కు మాత్రమే చెల్లుతుంది. రాష్ట్రంలో ఎంతో మంది విద్యార్థులు నీట్ పరీక్షలు రాసి వైద్య వృత్తిని చేపట్టాలని ఆశతో ఉన్నారు.అటువంటి వారి ఆశలపై నీళ్లు చల్లే విధంగా మెడికల్ సీట్లు వద్దంటూ లేఖలు రాయడం బాధాకరం. ప్రభుత్వ నిర్వాకం వల్ల మొత్తం 1800 సీట్లు రాకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ఉన్నతాశయంతో మెడికల్ కాలేజీ నిర్మించారు.చంద్రబాబు ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేసే కుట్ర చేయడం సరికాదు.
– మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత,జమ్మలమడుగు

ప్రశాంతంగా పశుసంవర్ధక శాఖ సహాయకుల పరీక్ష



పరీక్షకు హాజరైన పశుసంవర్ధకశాఖ సహాయకులు

వైవీయూ : కడప నగరంలోని గాంధీనగర్ హైస్కూల్‌లో ఆదివారం జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ డిపార్ట్‌మెంట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పశుసంవర్ధకశాఖ సహాయకుల ప్రొబేషన్ డిక్లరేషన్ కోసం నిర్వహించిన ఈ పరీక్షకు 204 మంది హాజరైనట్లు పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సి. శారదమ్మ తెలిపారు. పరీక్షకు పరిశీలకులుగా డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, డాక్టర్ పాండురంగారెడ్డి వ్యవహరించారు.

ఉత్సాహంగా తైక్వాండో పోటీలు



తైక్వాండో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీలను అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గీత, విజయభాస్కర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మరక్షణ విద్యలకు ఆదరణ పెరుగుతోందన్నారు. మార్షల్‌ఆర్ట్స్‌లో రాణించడం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా శారీరక, మానసిక ధృడత్వం లభిస్తుందన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ చక్కగా రాణించి మీ జిల్లాకు, రాష్ట్రానికి ఖ్యాతి తీసుకురావాలని కోరారు. అనంతరం పోటీలు నిర్వహించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా కొన్నిపాటి వెంకటేష్, రాజశేఖర్, ఫాజిల్‌బాషా, రేవంత్‌రెడ్డి, శ్రీకృష్ణవంశీ వ్యవహరించారు. కార్యక్రమంలో శిక్షకులు ఉదయ్‌కుమార్, విజయలక్ష్మి, గోపి, క్రీడాకారులు పాల్గొన్నారు.

17న 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

కడప అర్బన్ : కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని 'మిలాదున్ నబీ' నేపథ్యంలో రద్దు చేశారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


4878 కేసులకు పరిష్కారం

కడప అర్బన్ : జాతీయ న్యాయసేవాధికారసంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికారసంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 14న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 23 బెంచీలు ఏర్పాటు చేసి నిర్వహించిన ఈ జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 4484 క్రిమినల్ కేసులు, 270 సివిల్ కేసులు, 124 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయి. రూ.24,72,78,105 కక్షిదారులకు చెల్లించారు. వీటిలో జిల్లా వ్యాప్తంగా కడపలో 1544 కేసులు, ప్రొద్దుటూరులో 542 కేసులు, రాజంపేటలో 56 కేసులు, రాయచోటిలో 106, బద్వేల్ 1202 కేసులు, జమ్మలమడుగులో 721 కేసులు, సిద్ధవటంలో 118 కేసులు, రైల్వేకోడూరు లో 66 కేసులు, పులివెందులలో 301 కేసులు, నందలూరులో 32 కేసులు, లక్కిరెడ్డిపల్లిలో 58 కేసులు, కమలాపురంలో 132 కేసులు జాతీయలోక్ అదాలత్‌లో పరిష్కరించారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేసిన వివిధ శాఖల అధికారులకు, న్యాయమూర్తులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ జి. శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్‌లు అభినందనలు తెలిపారు.

హార్సిలీహిల్స్‌పై హైకోర్టు న్యాయమూర్తి

బి.కొత్తకోట : రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే.మన్మథరావు ఆదివారం మధ్యాహ్నం బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ సందర్శనకు విచ్చేశారు. కుటుంబంతో కలిసి విచ్చేసిన న్యాయమూర్తికి మదనపల్లె ఏడీజే న్యాయమూర్తి అబ్రహం, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి శ్రీనివాసరెడ్డి, సీఐ రాజారమేష్, డీటీ అహ్మద్ అన్సారీ, టూరిజం మేనేజర్ నేదురుమల్లి స్వాలీన్‌రెడ్డి, ఆర్ఐ బాలాజీ, వీఆర్‌ఓ నరేంద్ర స్వాగతం పలికారు. ఇక్కడి గవర్నర్ బంగ్లాలో విడిది ఏర్పాట్లు చేశారు. సోమవారం సాయంత్రం ఇక్కడినుంచి వెనుదిరిగి వెళ్లనున్నారు.

పన్ను బాదుడు



రామరాజుపల్లెలో రెవెన్యూ వార్డు–76లో మద్దూరు వెంకట సుబ్బమ్మకు ఒక అర్థ సంవత్సరానికి రూ.3137 పన్ను వచ్చేది. ఏడీపీ సర్వే తర్వాత ఆ పన్ను రూ.15,378కి పెరిగింది. ఏడు అర్థ సంవత్సరాల వెనక్కి పోయి 2021 నుంచి పన్ను అమలు చేయడంతో ఆమెకు పెనాల్టీలన్నీ కలిపి రూ.90,112 పన్ను వచ్చింది. ఇంత పన్ను ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలని వెంకట సుబ్బమ్మ లబోదిబోమంటోంది.

ఊటుకూరు పరిధిలో రెవెన్యూ వార్డు –97లో ఏ. రామచంద్రకు గతంలో అర్థ సంవత్సరానికిరూ.115 పన్ను వచ్చేది. ఏడీపీ సర్వే వల్ల అది రూ.6439కి పెరిగింది. పెనాల్టీలన్నీ కలిపి రూ.43,885 చెల్లించాలని నగరపాలక అధికారులు నోటీసు ఇచ్చారు.

కడప నగర శివార్లలోని ఎలక్ట్రికల్ కాలనీలో బాబూరావుకు డీకేటీ స్థలంలో ఓ ఇల్లు ఉంది. పన్ను కోసం అతను దరఖాస్తు చేయకపోయినా నగరపాలక అధికారులు పేరు లేకుండా పన్ను విధించారు. రూ.2500 పన్ను వేసిన అధికారులు అన్ని పెనాల్టీలు కలిపి రూ.25,000 పన్ను కట్టాలని, ఏమైనా ఉంటే వార్డు సచివాలయానికి వచ్చి మాట్లాడాలని అంటున్నారు.

ఇవి మచ్చుకు మాత్రమే...ఇలాంటి చిత్ర విచిత్రాలు కడప నగరంలో వేలకొలది ఉన్నాయి.
ఈ పన్ను ఎలా పెరిగిందో... ఎందుకు పెరిగిందో అర్థంగాక నగర వాసులు ఆందోళన చెందుతున్నారు.

- ఏడీపీ సర్వే పేరిట పన్నుల మోత
- రాష్ట్రంలో ఎక్కడా లేని పెనాల్టీలు... కడపలో విధింపు
- రూ.20కోట్లు వసూలు చేసేలా ప్రణాళిక
- నగర ప్రజలపై పెనుభారం

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా కడప నగరపాలక సంస్థలో పన్నుల బాదుడు మొదలైంది. ఏడీపీ(ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్) పేరిట ఈ ఒక్క ఏడాదే రూ.20కోట్ల మేర పన్నుల మోత మోగించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు ప్రజలకు నోటీసులిచ్చి అది వెంటనే చెల్లించకపోతే 2 శాతం అపరాధ రుసుం చెల్లించాలని హెచ్చరిస్తుండడం గమనార్హం. కొన్ని ఏరియాల్లో వీఎల్‌టీ పేరిట కూడా భారీ స్థాయిలో పన్నులు వేస్తున్నట్లు సమాచారం.



కడప నగరపాలక సంస్థ కార్యాలయం

ఏరియా డెవలప్‌మెంట్ పేరుతో..

అన్ని ఏరియాల్లో రోడ్లు, కాలువలు, తాగునీరు వంటి వాటిని అభివృద్ధి చేయాలని గత కమిషనర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారి టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఏడీపీ సర్వేను చేపట్టారు. మౌళిక వసతుల అభివృద్ధి కోసం చేపట్టిన ఈ సర్వే పక్కదారి పట్టింది. ఇంటింటికీ వెళ్లి నగరవాసులపై 100 శాతం పన్నుల మోత మోగించడమే పనిగా పెట్టుకున్నారు. ఈ సర్వే చేపట్టినప్పుడే పాలకవర్గంగా ఉన్న వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఆక్షేపించింది. దీనివల్ల ప్రజలపై పెనుభారం పడుతుందని హెచ్చరించింది. దీనిపై అప్పటి కమిషనర్ వివరణ ఇస్తూ ఇది కేవలం వ్యాపార సంస్థలకు మాత్రమే వర్తింపజేస్తున్నామని, దీనివల్ల కేవలం 3 వేల అసెస్‌మెంట్లు మాత్రమే ఎఫెక్ట్ అయ్యాయని నమ్మబలికారు. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో ఇదే అదునుగా భావించిన అధికారులు నగరంలోని అన్ని అసెస్‌మెంట్లకు దీన్ని వర్తింపజేస్తున్నారు. ఇప్పటి వరకూ 15వేలమందికి నోటీసులిచ్చినట్లు సమాచారం.

2024 ఎన్నికలు పూర్తయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొదటి సర్వసభ్య సమావేశంలోనూ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఏడీపీ సర్వేపై తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని ఈ సర్వేను కడపలోనే ఎందుకు అమలు చేస్తున్నారు...దీనివల్ల ప్రజలపై భారం పడుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకూ ఈ సర్వేను నిలుపుదల చేయాలని తీర్మాణం కూడా చేశారు. అయితే అధికారులు పాలకపక్షానికిగానీ, వారు చేసిన తీర్మాణానికి గౌరవం ఇవ్వకుండా తమ పని తాము చేసుకుంటూ పోతున్నారు.

పన్నులు ఎలా పెంచుతున్నారంటే..

ఒక యజమాని పదేళ్లక్రితం ప్లాన్ తీసుకొని ఒక ఇంటిని కట్టారనుకుందాం...తాజాగా 2024లో ఆ ఇంటిపై మరో ఇల్లు కట్టాడు. వాస్తవంగా కొత్తగా కట్టిన ఇంటికే ఇంప్రూవ్‌మెంట్ పేరిట పన్ను అదనంగా వేయాలి. కానీ అధికారులు ఎప్పుడో కట్టిన ఇంటికి ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం మొత్తం ఇంటికి పన్ను వేయడమేగాక ప్లాన్ అతిక్రమించినందుకు 100శాతం పెనాల్టీ, 7 అర్థ సంవత్సరాలు వెనక్కి పోయి పన్ను వేస్తున్నారు. దీనివల్ల పన్నులు అసాధారణంగా పెరిగిపోతున్నాయి.

గతంలో ప్రభుత్వం బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్)ను తెచ్చింది. దీని ద్వారా ఎవరైనా ప్లాన్ లేకుండా ఇళ్లు నిర్మించుకొని ఉంటే వారి నుంచి అన్ని ఫీజులు ఒక్కసారిగా కట్టించుకొని వారి భవనాలను క్రమబద్ధీకరించారు. కానీ ప్రస్తుత ఏడీపీ సర్వే ద్వారా అలాంటి భవనాలకు సైతం మళ్లీ 100 శాతం పెనాల్టీ విధిస్తున్నారు.

ఇల్లు కూల్చి గుడిసెలు వేసుకోవాలేమో...



నగరపాలక సంస్థ అధికారులు వేస్తున్న పన్నులు చూస్తుంటే ఇల్లు కూల్చేసి గుడిసె వేసుకుంటే మేలేమో అనిపిస్తోంది. మేం రెండు సెంట్లలో ఇల్లు కట్టుకున్నాం. అర్థ సంవత్సరానికే రూ.8వేలు పన్ను వేశారు. ఇంతింత డబ్బు ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలి. మేం చిన్న చితకా వ్యాపారాలు చేస్తూ జీవిస్తున్నాం. ఒకేసారి వేలల్లో పన్నులు వేస్తుంటే మా గతేం కావాలి.
– నారాయణరెడ్డి, నబీకోట

బీపీఎస్‌లో రెగ్యులర్ చేసుకున్నా 100 శాతం పెనాల్టీ



మా ఇంటిని బీపీఎస్‌లో రెగ్యులరైజ్ చేసుకున్నాం. ఈ మేరకు అధికారులు ప్లాన్ ఇచ్చారు. ఇప్పుడేమో ఆ ప్లాన్‌ను పరిగణలోకి తీసుకోకుండా 100 శాతం పెనాల్టీ వేసి కట్టమంటున్నారు. ఇదేం న్యాయం. ఎన్ని రివిజన్ పిటిషన్లు పెట్టుకున్నా అధికారులు స్పందించడం లేదు.
– కె. సుబ్బారావు, పాలెం పాపయ్య వీధి.

టౌన్‌ప్లానింగ్‌లోని 119 జీఓ ప్రకారం వంద శాతం పెనాల్టీ

రెవెన్యూలో 198 జీఓ ప్రకారం ప్లాన్ ప్రకారం కట్టకుండా 10 శాతంలోపు అతిక్రమించి నిర్మాణం జరిపితే వారికి 25 శాతం అదనంగా పన్ను విధించాలి, 10 శాతానికి మించితే 50 శాతం వరకూ పన్ను అదనంగా విధించవచ్చు. ప్లాన్ లేకుండా నిర్మాణం చేపడితే 100 శాతం పన్ను అదనంగా వేయాలి. అంటే ఉదాహరణకు రూ.100 ఉన్న పన్ను రూ.200 అవుతుందన్నమాట. కానీ నగరపాలక అధికారులు దీన్ని అమలు చేయకుండా టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించిన 119 జీవో ప్రకారం ఎంత శాతం ప్లాన్‌ను అతిక్రమించారని కాకుండా డీవియేట్ అయిన ప్రతి ఒక్క భవనానికి 100శాతం పెనాల్టీ విధిస్తున్నారు. అంతేగాక ఎప్పుడో పదేళ్లక్రితం కట్టిన భవనానికి అప్పుడున్న మార్కెట్ విలువ ఆధారంగా కాకుండా ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారంగా లెక్కకట్టడం వల్ల పన్నులు భారీగా పెరిగాయి. పన్నులు పెరిగిన వారు రివిజన్ పిటిషన్లు పెట్టుకోవచ్చని చెబుతున్నా... 2021 నుంచి 2024 వరకూ 7 అర్థ సంవత్సరాల పన్నును కడితేనే రివిజన్ పిటిషన్ స్వీకరిస్తుండటంతో దానివల్ల పన్ను తగ్గుతుందన్న ఆశ ఎవరికీ కలగడం లేదు.



నేడు మీలాద్ జులూస్

కడప కల్చరల్ : మహా ప్రవక్త మహమ్మద్ (సా.అ.వ) జన్మదిన మాసోత్సవం మిలాదున్ నబీ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం నగరంలో మిలాద్ జులూస్ నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ మర్కజ్ మిలాద్ జులూస్ కమిటీ కడపశాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అగాడిలోని ఇనాయత్‌ఖాన్ తాలిం వద్ద నుంచి ముస్లిం సంఘాల ర్యాలీ ప్రారంభం కానుంది.ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ ర్యాలీ అల్మాస్‌పేట, ట్రంకురోడ్డు, మద్రాసు రోడ్డు, గోకుల్ సర్కిల్, ఏడురోడ్లు, పాత బస్టాండుల మీదుగా ఎన్టీఆర్ సర్కిల్‌లోని గుంతబజారు మసీదుకు చేరుకోనుంది. అనంతరం అక్కడ భారీ ఎత్తున రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఆ తర్వాత అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై నాతియా మెహఫిల్ కార్యక్రమం నిర్వహిస్తారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



కౌశిక్

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న కోటపాటి కౌశిక్ సబ్‌జూనియర్స్ విభాగంలో జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి వైఎస్సార్‌జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.కృష్ణమూర్తి, జీ.వెంకటరమణ ఆదివారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఈనెల 13వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా అన్నవరంలో జరిగిన రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో కౌశిక్ ప్రతిభ కనబరచడంతో క్రీడాధికారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి ఐదురోజుల పాటు హరియాణలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో కౌశిక్ పాల్గొననున్నట్లు వారు తెలిపారు.

ఇసుక పంపిణీ సజావుగా జరగాలి

- 19 తేదీ నుంచి ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా పంపిణీకి సన్నద్ధమవ్వాలి
- కలెక్టర్ శివశంకర్ లోతేటి



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్ : ఇసుక పంపిణీ పారదర్శకంగా జరగాలని.. ముఖ్యంగా ఈనెల 19వ తేదీ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఆదివారం సాయంత్రం ఆన్‌లైన్ ద్వారా ఇసుకను బుక్ చేసుకోవడానికి సన్నద్ధత, ఇతర అంశాలపై రాష్ట్ర మైన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా, కమిషనర్ , డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్‌ఓ గంగాధర్ గౌడ్ సంబంధిత అధికారులతో హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ ఇసుక పంపిణీ విధానం సజావుగా పారదర్శకంగా జరిగేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఈనెల 19వ తేదీ నుంచి ఆన్లైన్ పోర్టల్ ద్వారా వినియోగదారుడు ఇసుకను పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు ఇసుకను ఆన్లైన్ ద్వారా బుక్ చేసుకుని ఇంటి వద్దకే ఇసుక అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వినియోగదారులు ఇసుకను ఎలా బుక్ చేసుకోవాలా అన్న విషయంపై ఈనెల 17న సంబంధిత సచివాలయాల సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. ఇసుక పంపిణీలో ఎలాంటి జాప్యం పొరపాటుకు తావివ్వకుండా పారదర్శకంగా ఇసుక పంపిణీ జరగాలని చెప్పారు. మైన్స్ అధికారులు విమలమ్మ, డీఆర్‌డీఏ ఏపీడీ ఆనంద్ నాయక్, ఆర్డీవో వెంకటపతి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు ప్రారంభం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఆదివారం సాయంత్రం ఆలయ ముఖ మండపంలో ప్రత్యేక వేదికపై దేవతామూర్తులను కొలువుదీర్చి పలు పూజా కార్యక్రమాలు, పవిత్రాల ప్రతిష్ఠ చేపట్టారు. అర్చక బృందం మచ్చా శేషాద్రిచార్యులు బృందం తదితరులు పూజాదికాలను నిర్వహించారు. తొలుత పుష్కరిణి వద్ద పుట్టమన్ను సేకరించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. సాయంత్రం భగవత్ అనుజ్ఞ, విశ్వక్సేన పూజ, వాసుదేవ పుణ్యాహావాచనం, రక్షాబంధనం, అంకురార్పణ, వాస్తు హోమం తదితరాలు నిర్వహించారు. అనంతరం మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. సోమ, మంగళ, బుధవారాలలో కూడా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

తిరుమల–తిరుపతి దేవస్థానాల పరిధిలోని దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి కొలువుదీర్చారు. అర్చకులు కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు.

దసరా అలంకరణ పనులకు వేళాయె

రాజంపేట టౌన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ప్రొద్దుటూరు తరువాత రాజంపేట పట్టణంలోని అమ్మవారిశాలలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నందున ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు అలంకరణ పనులకు పూజా కార్యక్రమాలతో శ్రీకారం చుట్టారు. ఈనెల 18వ తేదీ నుంచి మహాలాయల పక్షం ప్రారంభం కానుండటంతో అమ్మవారిశాల ఆలయ ప్రధాన అర్చకులు పద్మనాభ సోమయాజుల నరసింహులు స్వామి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అలంకరణ పనులకు అంకురార్పణ చేశారు. ఈ ఏడాది చూపరులను అబ్బురపరిచేలా అలంకరణలను చేపట్టనున్నట్లు ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యాయులు పబ్బిశెట్టి సుబ్రమణ్యం, నటకల రామకృష్ణ తెలిపారు. అమ్మవారిశాల వీధితో పాటు పట్టణంలోని పలు కూడలి ప్రాంతాల్లో విద్యుత్ దీపాలతో అమ్మవారి ప్రతిమలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది తమిళనాడు, తెనాలి ప్రాంతాలకు చెందిన కళాకారులు అలంకరణ పనులను చేపట్టనున్నారని వివరించారు. పదిరోజుల పాటు జరిగే దసరా ఉత్సవాల సందర్భంగా నిత్యం అమ్మవారిశాలకు వేలాది మంది భక్తులు వస్తారని అందువల్ల భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పడుచూరు చంద్రశేఖర్, మాగలూరు విజయ్ భాస్కర్‌గుప్తా, వల్లంకొండు చంద్రశేఖర్, ఎస్.సుధాకర్, బింగి హరికృష్ణ, వెంకటేశ్వర్లు, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం



ఉప్పరపల్లె వద్ద ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు చదును చేసిన దృశ్యం

సిద్దవటం : మండలంలోని ఉప్పరపల్లె గ్రామ పంచాయతీలోని రైల్వే ట్రాక్ పక్కన సర్వే నంబర్ 936/ఎ లోని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతోంది. లక్షల రూపాయలు విలువచేసే 10 సెంట్ల భూమిలో జేసీబీ యంత్రంతో చదును చేసి అక్కడ ఉన్న పురాతన కాలం నాటి ఎల్లమ్మ గుడిని కూలదోశారు. గతంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును కూడా తొలగించారు. ఈ విషయమై సంబంధిత వీఆర్‌ఓను వివరణ కోరగా జేసీబీతో పని చేస్తుంటే కొంతమంది గ్రామస్తులు తనకు సమాచారం ఇచ్చారని, ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా పనులు నిలుపుదల చేశామని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెంకట్రాజు

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామం పెట్రోల్ బంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకట్రాజు అనే వ్యక్తికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. సొంత పనుల నిమిత్తం వెంకట్రాజు చిన్నమండెం నుంచి రాయచోటి మండలం శిబ్యాలకు తన ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా రాయచోటి నుంచి మదనపల్లెకు వెళ్తున్న కారు దేవగుడిపల్లె పెట్రోల్ బంకు సమీపంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన వెంకట్రాజును 108 సాయంతో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

మరుగుదొడ్ల ఫొటోలు ఎస్‌ఎంసీ సభ్యులకు వద్దు

వైవీయూ : ఎస్‌ఎంసీ సభ్యులు పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలను వారంలో రెండు రోజులు తీయాలన్న నిబంధనలను ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. ఎస్‌ఎంసీ సభ్యుల ఉపాధికి ఆటంకం కలిగించే విధంగా ఉన్న ఈ నిబంధనలను తొలగించాలన్నారు.

'తుప్పు' పడుతున్నాయి!



ఆర్టీసీ గ్యారేజీ పక్కన తుప్పపట్టిన వాహనాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రవాణాశాఖ అధికారుల దాడుల్లో పట్టుబడిన వాహనాలను ఆర్టీసీ గ్యారేజీ పక్కన పార్కింగ్ చేశారు. ఏళ్ల తరబడి వాటిని అలాగే వదిలి వేయడంతో ఎండకు ఎండి, వానకు తడిసి ఇదిగో ఇలా తుప్పు పట్టిపోతున్నాయి. లగేజీ వాహనాలు దాదాపు 100–150 వరకు ఉండగా, ద్విచక్ర వాహనాలు 120 వరకు ఉన్నాయి. అధికారులు వీటిని వేలం వేయకపోవడంతో దుమ్ముపట్టి ఇలా తయారయ్యాయి. సకాలంలో వేలం వేసి ఉంటే ప్రభుత్వానికి ఏదో కొంతమేర ఆదాయం వచ్చేదని చూసిన పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆ దిశగా ఆలోచిస్తారేమో వేచి చూడాలి.

పులివెందులకు వచ్చి చూస్తారా మంత్రిగారూ!



వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పులివెందులకు వచ్చి చూస్తే తెలుస్తుంది. ఇక్కడ మెడికల్ కాలేజీ ఎంతవరకు నిర్మాణం పూర్తయిందో. ఊరికే నోరు పారేసుకుని మాట్లాడడం సమంజసం కాదు. కాలేజీ నిర్మాణం, బోధన సిబ్బంది, తరగతి గదులు ఎలా ఉన్నాయో ఒకసారి వచ్చి చూస్తే బాగుంటుంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదు.

– కల్లూరు చంద్రఓబుళ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, వేంపల్లి



రాజకీయ కుట్ర కోణం కనిపిస్తోంది



మెడికల్ సీట్ల విషయంలో రాజకీయ కుట్ర కోణం స్పష్టంగా కనిపిస్తోంది. వైద్య విద్య కోసం ఇతర దేశాలకు వలస వెళుతున్న విద్యార్థులు కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి నష్టపోతున్నారని ప్రభుత్వం గుర్తు తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది. పులివెందులకు మెడికల్ కళాశాల సీట్లు భర్తీ చేయడం ద్వారా రాష్ట్ర విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. అలాంటిది ప్రభుత్వం కొనసాగించకుండా తిరిగి పంపడం విద్యార్థులకు మోసం చేయడమే. మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యలు సరికాదు.

– జగన్, రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు, పర్లపాడు, రాజుపాళెం మండలం

ఆర్థిక భరోసా.. జీవితం కులాసా

- ఉద్యోగుల జీవితాలకు భరోసా ఇస్తున్న పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్
- తక్కువ ప్రీమియం.. ఎక్కువ బోనస్



కడపలోని ప్రధాన తపాలా కార్యాలయం



పీఎల్‌ఐ గురించి అవగాహన కల్పిస్తున్న తపాలా శాఖ అధికారులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీవితాలకు భరోసానిచ్చేలా భారత ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా ప్రవేశపెట్టిన తపాలా జీవిత బీమా పథకం పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ) ఎంతగానో దోహదపడుతుంది. 1884వ సంవత్సరం ఫిబ్రవరి 1న అప్పటి బ్రిటీష ప్రభుత్వంలో ఇది అమలైంది. నాడు తపాలా శాఖలో ఉద్యోగం చేసే పురుషుల కోసం మాత్రమే ప్రారంభమైంది. కాలగమనంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నిశాఖల ఉద్యోగులతోపాటుగా బ్యాంకు ఉద్యోగులు, కార్పొరేషన్ ఉద్యోగులు, గుర్తింపు పొందిన ఇంజినీరింగ్ కళాశాల ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్, డాక్టర్లు, న్యాయవాదులు, చార్టెడ్ అకౌంటెంట్లు అలాగే ప్రొఫెషనల్ డిగ్రీ కలిగిన బీటెక్, ఎంబీబీఎస్, ఎంబీఏ, ఎంసీఏ చదివి ప్రైవేటు ఉద్యోగం చేసే వారికి కూడా వర్తించేలా కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఓ జారీచేసింది.

ఇందులో 18 సంవత్సరాలు పూర్తయి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు పీఎల్ఐ స్కీమ్‌లో చేరేందుకు అర్హులు. ఇందులో రూ. 20 వేల నుంచి రూ. 50 లక్షల వరకు పాలసీ తీసుకునే వీలుంది. 2017 ఏప్రిల్ 1న జారీ చేసిన జీఓ ప్రకారం పైన తెలిపిన ఉద్యోగుల పాలసీలు తీసుకునే వెసులుబాటును కేంద్ర ప్రభుత్వం కల్పించింది. ఇదిలా ఉండగా పాలసీలు మూడు విధాలుగా మూడు నెలలు, ఆరు నెలలు, సంవత్సరానికి ఓసారి కట్టుకునే వెసులుబాటు ఉంటుంది. ఆ మేరకు ఆరు నెలలకు ఒకసారి కట్టుకునే పాలసీకి ఒక శాతం, సంవత్సరం పాలసీకి రెండు శాతం డిస్కౌంట్ వర్తిస్తుంది.

పీఎల్ఐలో ఆరు రకాల పాలసీలు

తపాలా జీవిత బీమాలో ఆరు రకాల పాలసీలు అమలవుతున్నాయి. అందులో సురక్ష, సంతోష్, సువిధ, సుమంగళ, యుగళ్ సురక్ష, బాల జీవన్ బీమా పాలసీలు ఉన్నాయి.

సురక్ష : ఇది హోల్ లైఫ్ పాలసీ. ఇందులో 19–58 సంవత్సరాలు గల వారు పాలసీ తీసుకోవచ్చు. రూ. 20 వేల నుంచి రూ. 50 లక్షల వరకు పాలసీ ప్రీమియం. నాలుగు సంవత్సరాలు కట్టిన తర్వాత రుణం తీసుకునే అవకాశం ఉంది. 60 సంవత్సరాలపాటు ప్రీమియం కట్టాల్సి ఉంటుంది. 80 సంవత్సరాల తర్వాత డబ్బులు తీసుకోవచ్చు. ప్రతి రూ. లక్షకు రూ. 7600 బోనస్ సంవత్సరానికి లభిస్తుంది.

సంతోష్ : ఈ పాలసీ తీసుకున్న వారు మూడు సంవత్సరాల తర్వాత రుణం తీసుకునే సదుపాయం ఉంది. కట్టిన ప్రీమియం మొత్తం ట్యాక్స్ సేవింగ్ బెనిఫిట్ కింద వెసులుబాటు ఉంది. పాలసీ ఆమోదించిన తేది నుంచి పూర్తి జీవిత రక్షణ ఉంటుంది. తపాలా శాఖ ద్వారా తీసుకున్న పాలసీలలో ఎక్కువ శాతం అంటే 80 శాతం మంది సంతోష్ పాలసీనే వినియోగదారులు ఇష్టపడుతున్నారు.

సువిధ : హోల్ లైఫ్ పాలసీదారులు ఐదు సంవత్సరాలు పూర్తయిన తర్వాత సంతోష్ పాలసీలోకి మారే అవకాశం కల్పించారు. తక్కువ డబ్బులు కట్టుకునే అవకాశంతోపాటు రుణం తీసుకునే వెసులుబాటు ఉంటంది.

సుమంగళి : సుమంగళి పాలసీని మనీ బ్యాక్ పాలసీ అని కూడా అంటారు. ఇందులో 15 సంవత్సరాలు కట్టిన వారు వరుసగా ఆరు సంవత్సరాలు పూర్తి కాగానే కట్టిన మొత్తంలో నుంచి 20 శాతం, అనంతరం 9 సంవత్సరాల తర్వాత మరో 20 శాతం, 12 సంవత్సరాల తర్వాత మరో 20 శాతం, చివరగా 15 సంవత్సరాల తర్వాత మిగిలిన 40 శాతం డబ్బుల తోపాటు అదనపు బోనస్ చెల్లింపు ఉంటుంది. అలాగే 20 సంవత్సరాల పాలసీ బోనస్‌తో లభిస్తుంది. ఈ రెండు పాలసీలు మధ్యతరగతి ఉద్యోగులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి.

యుగళ్ సురక్ష : ఇది జాయింట్ పాలసీ. ప్రీమియం మాత్రం ఒకరు చెల్లించాల్సి ఉంటుంది. రిస్క్ కవరేజ్ మాత్రం ఇద్దరికి (భార్యాభర్తలకు) వర్తిస్తుంది. సంతోష్ పాలసీ రూల్స్ వర్తిస్తాయి. ఇందులో ఐదు సంవత్సరాల నుంచి 20 సంవత్సరాలలోపు వయస్సుగల వారు మాత్రమే అర్హులు. ఈ పాలసీ కింద రూ. 3 లక్షల కంటే మించి ఇవ్వరు. తల్లిదండ్రులు ఇద్దరిలో కచ్చితంగా పాలసీ ఉంటేనే వర్తిస్తుంది.

బాల జీవన్ : ఈ పాలసీ తీసుకోవాలంటే ఐదు సంవత్సరాల నుంచి 20 సంవత్సరాల్లోపు బాలబాలికలు అర్హులు. పీఎల్ఐ పాలసీలో వారి తల్లిదండ్రులు నమోదై ఉంటేనే వీరికి ఈ పాలసీ వర్తిస్తుంది. ఇందులో రూ. 20 వేల నుంచి రూ. 30 లక్షల వరకు పాలసీ తీసుకునే వెసులుబాటు ఉంది.

తపాలా జీవిత బీమా పథకంతో మంచి రాబడి



మిగతా ఇన్స్రూ సంస్థల నుంచి వచ్చే రాబడి కన్నా తపాలా శాఖ ద్వారా అందించే పీఎల్ఐ పాలసీలో మంచి రాబడి ఉంటుంది. ఉద్యోగులు పీఎల్ఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

- రాజేష్, పోస్టల్ సూపరింటెండెంట్, కడప డివిజన్

మహిళా కార్మిక హక్కుల రక్షణకు పోరాటం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు

ప్రొద్దుటూరు : ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు పని భద్రత, రక్షణ చట్టాలను అమలు చేయాలని, మహిళా కార్మిక చట్టాల, హక్కుల రక్షణ కోసం పోరాటానికి సమాయత్తం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పిలుపునిచ్చారు. స్థానిక ప్యారడైజ్ ఎస్వీఎస్ ఫంక్షన్ హాల్‌లో స్కీం కార్మికుల రెండు రోజు రాష్ట్రస్థాయి సైద్ధాంతిక శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ముందుగా ఏఐటీయూసీ జెండాను డాక్టర్ పి.సంజీవమ్మ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులు చాలీచాలని వేతనాలతో పనిచేసే చోట అభద్రతాభావంతో పనిచేస్తున్నారన్నారు. అలాంటి వారికి భద్రత కల్పించి, వేతనాలు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పాలక ప్రభుత్వాలు మహిళా సాధికారత దిశగా అడుగులు వేయకుండా మహిళల హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, స్కూల్స్ స్కావెంజర్స్ తదితర రంగాల్లో పనిచేస్తున్న మహిళలందరూ పేద కార్మికులన్నారు. వారి వేతనాల పెంపునకు ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి వీడాలన్నారు. హెల్త్ అండ్ ఆటిట్యూడ్ అనే అంశంపై నవ్యాంధ్ర రాష్ట్ర రచయితల సంఘం గౌరవాధ్యక్షురాలు అరుణ వివరించారు. లింగ వివక్షత అనే అంశంపై డాక్టర్ పి.సంజీవమ్మ, మహిళలను సంఘటితం చేయడంలో ట్రేడ్ యూనియన్ పాత్ర అనే అంశంపై ఏఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి.ఓబులేసు, అసంఘటిత రంగం– మహిళా సమస్యలు అనే అంశంపై వెంకటసుబ్బయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, రాష్ట్ర కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, స్కీం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు లలితమ్మ, మంజుల, బాబు, రమేష్, శాంతి, బాలకృష్ణ, ప్రవంతి, సుభాషిణి, రాష్ట్ర వ్యాప్తంగా స్కీం కార్మిక యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక, శారీరక వికాసానికి క్రీడలు దోహదం

ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి



విజేతలకు బహుమతి అందజేస్తున్న కడప డివిజన్ ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : మానసిక, శారీరక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని కడప డివిజన్ ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో జిల్లా స్థాయిలో జరిగిన క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నిరంతరం విద్యాబోధనలో తలమునకలై ఉండే ఉపాధ్యాయులకు ఈ పోటీల నిర్వహణ మంచి ఆటవిడుపు లాంటిదన్నారు. ఉపాధ్యాయులకు మానసిక వికాసంతోపాటు, శారీరక శ్రమ కూడా అవసరమన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ 50 ఏళ్ల యూటీఎఫ్ పోరాటాలు, విద్యారంగ విషయాలు, భవిష్యత్ కార్యాచరణలు, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ తదితర విషయాలపై చర్చించేందుకు డిసెంబర్ 13, 14, 15, 16 తేదీల్లో నాలుగు రోజుల పాటు కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాస్థాయిలో విజేతలైన ఉపాధ్యాయులందరికీ అక్టోబర్ 4వ తేదీ నుంచి ఆరవ తేదీ వరకు గుంటూరులో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి అక్కడ విజేతలైన వారికి కాకినాడలో జరగబోయే స్వర్ణోత్సవ మహాసభలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎస్.ఎజాస్ అహ్మద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా మోపూరి బాలకృష్ణారెడ్డి



ఎం. బాలకృష్ణారెడ్డి

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడిగా మోపూరి బాలకృష్ణారెడ్డి (సాక్షి బ్యూరో ఇన్‌చార్జి), ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన ఎన్నికలో జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో వీరారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా, శివనాగరాజు సహాయ కార్యదర్శిగా, రాజా ఆర్గనైజింగ్ సెక్రటరీగా, రామ్మోహన్‌రెడ్డి, సుబ్బయ్య, శ్రీనివాసులు, సుబ్బయ్య, జయచంద్రలు ఈసీ మెంబర్లుగా ఎన్నికయ్యారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పి.రామసుబ్బారెడ్డి నేతృత్వంలో జరిగిన ఎన్నికకు జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు హాజరయ్యారు. ఎన్నికల అధికారులుగా రాష్ట్ర కమిటీ సభ్యులు రామాంజనేయ రెడ్డి, శ్రీనివాస్ వెన్నులు వ్యవహరించారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ కమిటీ మొత్తం ఏకగ్రీవం కావడం జర్నలిస్టుల ఐక్యతకు నిదర్శనంగా నిలిచిందన్నారు. నూతన కమిటీకి గౌరవాధ్యక్షుడిగా వెంకటరెడ్డి, సలహాదారులుగా పాలగిరి విశ్వప్రసాద్ రెడ్డి, రామాంజనేయ రెడ్డి, కోశాధికారిగా సుబ్బరాయుడు ఎన్నికయ్యారు.

ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఎన్నిక

ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా రమణారెడ్డి, రాజు ఎన్నిక కాగా గౌరవాధ్యక్షుడిగా భూమిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి, సలహాదారుగా ప్రతాప్ ఎన్నికయ్యారు.

వ్యక్తిపై కత్తితో దాడి

కడప అర్బన్ : కడప నగరంలోని బిల్టప్ సర్కిల్ సమీపంలో ఆదివారం బార్ బయటకు వచ్చిన అహ్మద్ అనే వ్యక్తిపై రాజగోపాల్, తన స్నేహితులతో కలిసి కత్తితో దాడి చేశాడు. మద్యం సేవించే సమయంలో అహ్మద్‌కు, రామరాజుపల్లికి చెందిన రాజగోపాల్, అతని స్నేహితులకు మధ్య వాగ్వావాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో అహ్మద్‌పై కత్తితో దాడి చేసి గాయపరిచారు. బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప తాలూకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

సాయిపేట సమీపంలో..

కడప నగర శివార్లలోని పాలెంపల్లిలో తన ఇంటికి వెళుతున్న లక్ష్మీనారాయణ అనే వ్యక్తిపై సాయిపేట సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. అప్సరా సర్కిల్ సమీపంలో కూల్ డ్రింక్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలోనే లక్ష్మీనారాయణ ఇంటికి వస్తుండగా ఈ దాడి జరిగింది. గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జిల్లాలో ఇద్దరు డీఎస్పీల బదిలీ

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా 47 మంది డీఎస్పీలను పోలీసు ఉన్నతాధికారులు ఆదివారం బదిలీ చేశారు. వీరిలో కడప ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తున్న వి. గిరిధర్ తిరుపతి ఎస్బీ డీఎస్పీగా బదిలీ అయ్యారు. అలాగే కడపలోని డీపీటీసీ డీఎస్పీగా ఎస్.కె.అబ్దుల్ కరీంను నియమించారు.

1.5 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎస్‌కే రోషన్, ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి

కమలాపురం : మండలంలోని యువతకు గంజాయి విక్రయిస్తూ వారి జీవితాలను బుగ్గిపాలు చేస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు కమలాపురం సీఐ ఎస్ కె.రోషన్ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు.. ఎస్ఐ ప్రతాపరెడ్డి, సిబ్బంది గంజాయి విక్రేతలపై నిఘా ఉంచారన్నారు. ఆదివారం ఎస్ఐ, సిబ్బందితో కలిసి టి.చదిపిరాళ్ల సమీపంలోని సాయిబాబా గుడి వద్ద దాడులు చేశామన్నారు. గంజాయి విక్రయిస్తున్న చదిపిరాళ్ల గ్రామానికి చెందిన చిట్టే ప్రతాపరెడ్డి, జంగంపల్లెకు చెందిన నరేష్, చెన్నూరుకు చెందిన కాటయ్య, పెద్దచెప్పలికి చెందిన శ్రీనివాసులును అరెస్టు చేసినట్లు తెలిపారు. ప్రతాపరెడ్డి ఇప్పటికే ఒకసారి గంజాయి విక్రయిస్తూ వైజాగ్‌లో పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చారన్నారు. మిగిలిన ముగ్గురితో ఓ ముఠాగా ఏర్పడి వైజాగ్, అరకు, రాజమండ్రి ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకువచ్చి 25 గ్రాముల పాకెట్లుగా చేసి విక్రయిస్తున్నాడని తెలిపారు. వారి నుంచి 1.5 కిలోల గంజాయి, రెండు బైక్‌లు, రూ.19వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ ప్రతాపరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై దురుసుగా ప్రవర్తించిన పారిశుద్ధ్య ఉద్యోగిని

సిద్దవటం : సిద్దవటంలోని మట్లిరాజుల కోటకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన తహసీల్దార్ పట్ల పారిశుద్ధ్య ఉద్యోగిని దురుసుగా ప్రవర్తించిన ఘటన ఆదివారం జరిగింది. సిద్దవటం తహసీల్దార్ మురాషావలీ తన కుటుంబంతో ఆదివారం సిద్దవటం కోటకు వెళ్లారు. కోట గేటు తాళాలు తన వద్ద ఉన్నా పారిశుద్ధ్య ఉద్యోగిని తాళాలు తీయకుండా తహసీల్దార్ పట్ల దురుసుగా ప్రవర్తించింది. దీంతో ఆయన సంబంధిత పురాతత్వ సర్వేక్షణ ఎంటీఎస్ సిబ్బందిని పిలిపించి గేటు తాళాలు తీయించారు. ఈ మేరకు పురాతత్వ సర్వేక్షణ జిల్లా అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కాగా కోటలో పనిచేసే మహిళా పారిశుద్ధ్య ఉద్యోగినిపై పలు ఆరోపణలు ఉన్నాయి . పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లకు తాళాలు తీయక పోవడం, కోటలోకి వెళ్లే గేటు ఎదుట కుర్చీలో కాలుమీద కాలు వేసుకొని కూర్చోవడం, కోటలో వీడియోలు తీసుకునే వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి వారికి రసీదులు ఇవ్వక పోవడం వంటి ఆరోపణలు ఆమెపై ఉన్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.

అటవీ శాఖ హౌస్ బిల్డింగ్ సొసైటీ నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న సొసైటీ ప్రెసిడెంట్ రత్నరవి

కడప అర్బన్ : కడపలోని జిల్లా అటవీశాఖ కార్యాలయం వెనుక వైపున ఉన్న సమావేశ మందిరంలో ఆదివారం కడప జిల్లా అటవీశాఖ హౌస్ బిల్డింగ్ సొసైటీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. హౌస్ బిల్డింగ్ సొసైటీ ప్రెసిడెంట్‌గా ఇ.వి రత్నరవి, వైస్ ప్రెసిడెంట్‌గా కె. భాస్కర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా ఎస్. బుడెన్ సాహెబ్, జాయింట్ సెక్రటరీగా సి. రోశయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి. రవికుమార్, ట్రెజరర్‌గా టి. నాగరాజును ఎన్నుకున్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించిన ఎన్నికల నిర్వహణ సహాయ అధికారులైన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు రామ్లానాయక్, ఎం.వి సుబ్బారెడ్డి (రిటైర్డ్), రమణారెడ్డి (రిటైర్డ్)లకు ఏపీ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

'డాక్టర్ తవ్వా'కు బళ్లారి కల్చరల్ అవార్డు



అవార్డు అందుకున్న డాక్టర్ తవ్వా వెంకటయ్య

కడప కల్చరల్ : జిల్లాకు చెందిన యువ రచయిత, సాహిత్య పరిశోధకుడు డాక్టర్ తవ్వా వెంకటయ్యకు బళ్లారి కల్చరల్ అసోసియేషన్ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందజేసింది. ఆదివారం బళ్లారి నగరంలోని ప్రముఖ ఆడిటోరియంలో సంస్థ అధ్యక్షుడు శీలం బ్రహ్మయ్య ఈ అవార్డును వెంకటయ్యకు అందజేశారు. నాటక, సాహిత్య రంగాలలో విశేష కృషి చేసిన వ్యక్తులకు ఇచ్చే ఈ పురస్కారాన్ని ఈ సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యుడైన డాక్టర్ తవ్వాకు ఇచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి, జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం, గౌరవాధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శులు, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థిని మృతి



మృతి చెందిన అల్లిక

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ పోలీసు స్టేషన్ పరిధిలో సరోజినీనగర్‌లో నివాసం ఉంటున్న ఉరుకుంద, ఉరుకుందమ్మల రెండవ కుమార్తె వై. అల్లిక (11) అనే విద్యార్థిని ఆదివారం ఇంటి దగ్గర మోటార్ స్విచ్ ఆన్ చేయగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. తల్లిదండ్రులు, అక్క నాగలక్ష్మి పనికి వెళ్లారు. వారు ఎవరూ లేని సమయంలో నీళ్లు రావడంతో మోటార్‌ను వేయగా ఉన్నట్లుండి షాక్ కొట్టింది. దీంతో కిందపడి తీవ్ర అస్వస్థతకు గురైంది. స్థానికులు ఆమెను రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రిమ్స్ ఎస్ఐ జయరాములు తెలిపారు.

వైఎస్ జగన్ ప్రభుత్వంలో విద్యకు అగ్రతాంబూలం

- మెడికల్ కాలేజీ సీట్లు వెనక్కి తీసుకోవాలని ఎన్ఎంసీకి బాబు లేఖ రాయడం సిగ్గుచేటు
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో విద్యకు అగ్రతాంబూలం ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల వైద్య విద్య కలలను కూటమి ప్రభుత్వం ఛిద్రం చేసిందన్నారు. పట్టణంలోని పోరెడ్డి నరసింహారెడ్డి కార్యాలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే రాచమల్లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటయ్యాక విద్యావిధానంలో తీరని నష్టం జరిగిందన్నారు. నిర్వహణ భారం సాకుతో మెడికల్ కాలేజీ సీట్లను వెనక్కి తీసుకోవాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు చంద్రబాబు లేఖ రాశాన్నారు. ఫలితంగా 1800 ఎంబీబీఎస్ సీట్లను విద్యార్థులు కోల్పోతున్నారని తెలిపారు. చంద్రబాబు ప్రైవేట్ మోజుతో ఈ ఒక్క ఏడాదిలోనే 700 ఎంబీబీఎస్ సీట్లను రాష్ట్రం కోల్పోయిందన్నారు.

ఐదేళ్లలోనే జగన్ 17 కాలేజీలకు శ్రీకారం

స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి మొదలుకొని 2019 వరకు రాష్ట్రంలో కేవలం 37 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. అందులో 19 ప్రభుత్వ, 18 ప్రైవేట్ మెడికల్ కాలేజీలు ఉన్నాయన్నారు. 1923లో మొట్టమొదటి మెడికల్ కాలేజీ 'ఆంధ్రా మెడికల్ కాలేజీ' పేరుతో విశాఖపట్టణంలో ఏర్పాటైందని చెప్పారు. 101 ఏళ్లలో పాలకులందరూ కలిపి రాష్ట్రంలో 37 మెడికల్ కాలేజీలు తెస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక కేవలం ఐదేళ్లలోనే 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టారన్నారు. ఒక్కో కాలేజీకి రూ. 500–600 కోట్లు ఖర్చు పెట్టారని తెలిపారు. వాటిలో 5 కాలేజీలకు 2023–2024 విద్యాసంవత్సరంలో ఎన్ఎంసీ ద్వారా అనుమతులు తీసుకొచ్చి 750 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ ఏడాదిలో మరో ఐదు కాలేజీ నిర్మాణం పూర్తవుతందని ఎన్ఎంసీ అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ ఐదు కాలేజీలకు 1050 సీట్లు వస్తాయని పేర్కొన్నారు. తర్వాత థర్డ్ ఫేస్‌లో ఏడు మెడికల్ కాలేజీలు ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ద్వారా తక్కువ ఫీజుతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంబీబీఎస్ చదివించాలనేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. చంద్రబాబు పుణ్యాన మెడికల్ సీట్లను ప్రైవేట్ పరం చేస్తే 550 –600 మార్కులు వచ్చినా సీటు గ్యారెంటీ లేదన్నారు. ఓసీలకైతే నీట్‌లో 600 మార్కులు వచ్చినా సీట్ రాదని తెలిపారు. మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరమైతే విద్యార్థుల తల్లిదండ్రుల పైన ఆర్థిక భారం పడుతుందన్నారు. ధనవంతులతో సమానంగా పేద విద్యార్థులకు అవకాశం కల్పించి సమాజంలో గౌరవంగా నిలబెట్టాలని మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రయత్నం చేస్తే.. సీఎం చంద్రబాబు విద్యను వ్యాపారం చేయాలని చూస్తున్నారని రాచమల్లు ధ్వజమెత్తారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా రాష్ట్రంలోని వెయ్యి పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను వైఎస్ జగన్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టారన్నారు. దీంతో ఈ ఏడాది 85 లక్షల మంది పిల్లలు సెంట్రల్ సిలబస్‌తో పరీక్షలు రాయాల్సి ఉందని తెలిపారు. అయితే చంద్రబాబు వచ్చిన తర్వాత జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేశారన్నారు. ఇంకా జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన టోఫెల్, ఐబీ విధానాలను చంద్రబాబు రద్దు చేశారన్నారు. రూ. 24 వేల కోట్లు వెచ్చించి రాష్ట్రంలోని 6 వేల పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలను కల్పించిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో 4300 పాఠశాలలు మూతపడ్డాయన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.